క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీపీవో



ఎమ్మెల్యే రేఖానాయక్‌కు మొక్క అందజేస్తున్న డీపీవో

ఖానాపూర్: జిల్లా పంచాయతీ అధికారిగా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన శ్రీలత ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను మర్యాద పూర్వకరంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మొక్క అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అధికారులు భాగస్వాములు కావాలన్నారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు పార్శపు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజగంగన్న, పడిగెల శేఖర్, పెద్ది నర్సయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



పోట్‌పల్లిలో విలేజ్ మ్యాప్ వేసి గ్రామంపై అవగాహన కల్పిస్తున్న మధుమిత

లోకేశ్వరం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్‌బీఎం ట్రెయినీ మధుమిత అన్నారు. ఎస్‌బీఎం శిక్షణలో భాగంగా పోట్‌పల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామం మ్యాప్‌ను వేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుమిత మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనం, వర్మీకంపోస్టు ఎరువు తయారీని పరిశీలించి వాటి గురించి వివరించారు. 10 టీంలుగా ఏర్పడి గ్రామంలో సర్వే నిర్వహించారు. ఎంపీడీవో సల్మాన్‌రాజ్, సర్పంచ్ సురేఖబాయి, మమత, నవీన్, శిక్షణలో ఉపాధిహామీ సిబ్బంది, ఐకేపీ ఏంటీకేలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా హాఫీజే ఖురాన్ జల్సా



హాఫీజ్‌ను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని మసీదులో హాఫీజే ఖురాన్ జల్సా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖురాన్ పఠనం అనంతరం సుమారు వందమంది హాఫీజ్‌లను మతపెద్దలు పూలమాల, శాలువాతో సన్మానించారు. జక్కిభాయ్, ఆబిద్ ఖాన్, తఖీఉల్లఖాన్, రైస్ ఖాన్, సికందర్, జమీల్, ఫసి, సలీం, మజర్, సదర్ హాఫీజ్ సయ్యద్, ఇర్ఫాన్ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాల తొలగింపు పనులు పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని రోడ్డు వైడింగ్ పనుల్లో భాగంగా స్తంభాల తొలగింపు పనులను శుక్రవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ పరిశీలించారు. కాగా స్తంభాల తొలగింపు చేపట్టాల్సిన చర్యలు, తదితర విషయాలపై మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఏఈ తిరుపతితో చర్చించారు. డీఈ నాగరాజు, ఏడీ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

దుకాణాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన పలు దుకాణాలను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, తౌహీద్ ఉద్దీన్ రప్పు, నరేందర్, ఆలయ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ పద్మనాభం, పూదరి శివ, భూపతి, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ముధోల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 20వ తేదీలోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎండీ రఫీవొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వంతెనకు నిధులు ఎప్పుడో ?

- కూలడానికి సిద్ధంగా అర్లి వంతెన
- ఇంకా చేపట్టని మరమ్మతు
- రాకపోకలకు ఇబ్బందులు



ఓ పక్కన కూలిన వంతెన



అర్లి వంతెన ఇదే..

లోకేశ్వరం: మండలంలోని హవర్గ–అర్లి మార్గంలోని వంతెన శిథిలావస్థకు చేరింది. 1981లో ఎస్సారెస్పీ నిధులతో నిర్మించిన వంతెన కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ వంతెన నుంచి ప్రయాణం చేయడానికి వాహనదారులు జంకుతున్నారు. వంతెన ప్రారంభంలో ఇరువైపులా ఉన్న గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. వంతెన వద్ద వర్షపు నీరు నిలుస్తోంది. రెండు నెలల కిందట నాన్ ప్లానింగ్ రూ.కోటి 80 లక్షలతో అర్లి నుంచి లోకేశ్వరం వరకు తారు రోడ్డును వేశారు. అర్లి వంతెన కూలినట్లయితే తాత్కాలికంగా ఏర్పాటు చేయడానికి ఎలాంటి మార్గం లేదు. మండలం నుంచి ప్రతినిత్యం వందల సంఖ్యలో ఈ వంతెనపై గుండా వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన ద్వారా నిర్మల్‌కు చేరుకోవడానికి 45 కి.మీ ప్రయాణించాలి. వంతెన కూలితే భైంసా మీదుగా వెళ్లాలంటే 85 కి.మీ దూరభారం అవుతుంది. వంతెన కూలకముందే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టండి



అర్లి వంతెనకు మరమ్మతు చేపట్టాలి. వంతెనపై నుంచి ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నాం. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి మరమ్మతు పనులు చేపట్టాలి.
– సాయారెడ్డి, రాయపూర్‌కాండ్లీ

ప్రతిపాదనలు పంపాం

అర్లి వంతెన శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. ఈ వంతెనపై భారీ లోడ్ వాహనాలను ప్రయాణం చేయకుండా నిషేధించాం. వంతెన విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు పనులు చేపడుతాం. – రఘు, ఆర్‌అండ్‌బీ ఏఈ, లోకేశ్వరం

అటెన్షన్ ప్లీజ్

నీరు వృథా

తానూరు: మండలంలోని దౌలతాబాద్‌లో నీరు వృథాగా పోతోంది. బోరుమోటారు నుంచి పైప్‌లైన్ ద్వారా నల్లాలు ఏర్పాటు చేశారు. వాటికి ట్యాప్‌లు పెట్టకపోవడంతో నీరు వృథాగా పోతోంది. మండే వేసవికాలం కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు నల్లాలకు ట్యాప్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: మోహన్‌సింగ్, ఎంపీవో, సెల్: 98666 51826



విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఎస్ఎంసీ వైస్ చైర్మన్ యూనిస్

కుంటాల: విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఎస్ఎంసీ వైస్ చైర్మన్ యూనిస్ సూచించారు. మండలంలోని ఓలా ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి రూ.3 వేలు, ద్వితీయ విద్యార్థికి రూ.2 వేలు, తృతీయ విద్యార్థికి రూ.వెయ్యి నగదును తనవంతుగా అందజేస్తానని ప్రకటించారు. హెచ్ఎం సునీల్‌రెడ్డి, ఉపాధ్యాయులు జమీల్‌హైమ్మద్, రిజ్వాన్‌షేక్, సోఫీ, నహీమా, భోజన్న, మోహబుబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలు, వాటి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాథ్గాంలో మూడు రోజులుగా జరుగుతున్న అడెల్లి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో శుక్రవారం ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరంలో లోకేశ్వరంలోని షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్రూంలు మంజూరు చేస్తామని అన్నారు. వర్షాలకు పంటన నష్టపోయిన రైతులకు గురించి ప్రభుత్వం నివేదిస్తామన్నారు. పద్మశ్రీ తారక రామారావు జాతీయ అవార్డు పొందిన మా అమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులను సన్మానించారు. మాజీ జెడ్పీ చెర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ లక్ష్మి, నాయకులు బాయమొల్ల భోజన్న, సాయారెడ్డి, నర్సింగ్‌రావు, దిగంబర్, బండి ప్రశాంత్, దిలీప్, ఆనంద్‌రావు పటేల్ పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం



విజయోత్సవంలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజయం నాంది కావాలని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపొందిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాయకులు అయ్యన్న గారి భూమయ్య, మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, అలివేలు మంగ, సాదం అరవింద్, కౌన్సిలర్ సాదం స్వప్న, మల్లికార్జునరెడ్డి, నాయుడు మురళీ, అయ్యన్న గారి రాజేందర్, అనుముల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

లక్ష్మణచాంద: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బీజేపీ నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ నాయిడి మురళీ పేర్కొన్నారు. మండలంలోని వడ్యాల్‌లో శుక్రవారం బూత్ స్వశక్తి కరణ్ అభియాన్‌లో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించి ఉపాధ్యాయులు కేసీఆర్ ప్రభుత్వం మీద తిరుగుబాటు చేశారన్నారు. బీజేపీని సంస్థాగతంగా బూత్ స్థాయిలో బలపర్చాలన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. సమావేశంలో మండల నాయకులు గోవర్దన్, భరత్ నారాయణ, మోహన్, రాజు, భూమేశ్వర్, స్వామి, హరీశ్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారు'

భైంసాటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి తగిన గుణపాఠం చెప్పారని బీజేపీ నాయకుడు పవార్ రామారావ్‌పటేల్ అన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఘన విజయం సాధించడంపై భైంసాలోని ఎస్ఎస్ కాటన్‌లో శుక్రవారం కార్యకర్తలు, నాయకులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం రామారావ్‌పటేల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు అవినీతి, కుంభకోణాలకు కేరాఫ్‌గా మారిందని, రానున్న ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, గోపాల్ సర్డా, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, ఎంపీటీసీ సభ్యుడు రజాక్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తోట లింగురాం, దత్తాత్రి, రాజేశ్వర్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో పురోహితుడు పాల్దె నరహరి శర్మ ఆధ్వర్యంలో శనివారం పూజా కార్యక్రమాలు, ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అరుగు మీది రాంరెడ్డి పేర్కొన్నారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కడెం: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లింబాద్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

ముధోల్: మండలంలోని విఠోలి గ్రామంలో శుక్రవారం రైతులకు వరి పంటలో చేపట్టే సస్యరక్షణ చర్యలపై ఏవో అజ్మీరబాస్కర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అగ్గితెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఏఈవో సిరాజ్, రైతులు ఉన్నారు.

'కంటి వెలుగు' పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో అజీజ్‌ఖాన్

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో అజీజ్‌ఖాన్ శుక్రవారం పరిశీలించారు. ఇప్పటి వరకు వెయ్యికి పైగా కంటి పరీక్షలు నిర్వహించామని డాక్టర్ శరత్‌చంద్ర తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం ఈనెల 23 వరకు కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో, ఎంపీవో కోరారు. దిలావర్‌పూర్ పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

లక్ష్మణచాంద: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ హైమావతి కోరారు. మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో న్యూవెల్మల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఈనెల 23 వరకు కార్యక్రమం కొనసాగుతుందని సర్పంచ్ తెలిపారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీడీసీ సభ్యుడు రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న నాయకులు

కడెం: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలకు నిరసనగా మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు శుక్రవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. లీకేజీ కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జోషఫ్ గంగయ్య, రెహమన్, గంగయ్య, తదితరులు ఉన్నారు.

సీతారామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేటలో సీతారామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, అర్చకుడు వంశీధరాచార్యుల ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, యంత్ర, విగ్రహ, శిఖర సహిత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహబలి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖనాయక్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ శారద, సర్పంచ్ సుజాత, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య యాదవ్, రాజనర్సయ్య, నాయకులు సత్యం, గోపి, విజయ్, శివయ్య, సుధాకర్, సత్తయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకులను విడుదల చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని నాలుగు రోజుల క్రితం ముట్టడించారు. ఈ సందర్భంగా అరెస్టు చేసిన బీజేవైఎం నాయకులను విడుదల చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద శుక్రవారం నిరసన దీక్ష చేపడితే కార్యకర్తలతో పాటు ఆయన్ను అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. సర్కారు వైఫల్యాలను ప్రశ్నిస్తే గొంతునొక్కే ప్రయత్నం చేస్తోందని అన్నారు. కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలన్నారు. అక్రమ కేసులు నిరసిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వర్షాలకు నేలకొరిగిన పంటలు



తిర్పెల్లి వద్ద నేలకొరిగిన మొక్కజొన్న

లక్ష్మణచాంద/భైంసాటౌన్: అకాల వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. లక్ష్మణచాంద మండలంలో గురువారం రాత్రి సమయంలో కురిసిన వర్షాలకు మొక్కజొన్న, నువ్వు పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. భైంసా మండలంలోని గ్రామాల్లో రైతులు పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పుతున్నారు. మూడు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలతో శనగల కొనుగోళ్లు నిలిపేశారు. రైతులు కల్లాల్లో ఆరబెట్టిన శనగలు తడవకుండా చూసేందుకు ఇక్కట్లు పడుతున్నారు. లక్ష్మణచాంద మండలంలో ధాన్యంపై టార్పాలిన్లు కవర్లు కప్పారు.


కార్గో ద్వారా ఇంటికే కల్యాణ తలంబ్రాలు

నిర్మల్‌టౌన్: ఈనెల 30న శ్రీరామనవమి పురస్కరించుకుని భద్రాద్రిలోని సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే అందిస్తారని బస్ డిపో మేనేజర్ సాయన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నిర్మల్ బస్‌స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రూ.116 చెల్లిస్తే ఇంటి వద్దకే కల్యాణ తలంబ్రాలు అందిస్తారని తెలిపారు.

రైతు బజార్లలో..

కూరగాయలు	కిలో (రూ.లో)
టమాట	10
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్



సినిమాలు



తిరుమల: కబ్జా

నారాయణ: బలగం

హరితవనం ఆక్రమణ పాలు







రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం అభాసుపాలవుతోంది. జిల్లాకేంద్రంలో ప్రధాన రహదారి శివాజీచౌక్ సమీపంలోని కంచరోని చెరువు అనుకొని ఉన్న కట్టకు ఇరువైపులా ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటి ఫెన్సింగ్ వేశారు. అయితే అదే స్థలంలో కొందరు ఆక్రమించుకుని వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. మరికొందరు మొక్కలను తొలగించి అక్రమ ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. అధికారులు మాత్రం వాటి నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో మొక్కలు ఎండిపోవడంతోపాటు ట్రీగార్డులు పడిపోయి దర్శనమిస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఉపాధి రికార్డుల క్రోడీకరణ పనులు షురూ

ఖానాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రికార్డుల క్రోడీకరణ పనులు మండలంలో ప్రారంభమయ్యాయి. మండలంలో 2019 నుంచి 2022 మార్చి వరకు జరిగిన పనులకు త్వరలో చేపట్టనున్న సామాజిక తనిఖీలో భాగంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్ల రికార్డుల పరిశీలన పనుల్లో బిజీగా ఉన్నారు. అనంతరం రికార్డులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. తర్వాత అధికారులు వాటిని సామాజిక తనిఖీ బృందానికి అందజేస్తారు. అనంతం గ్రామాల వారీగా గ్రామసభలు చేపడుతారు. కాగా, సామాజిక తనిఖీపై ఈనెల 20న సన్నాహక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీవో మల్లేశం తెలిపారు. గ్రామసభల అనంతరం ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.